ప్రజాశక్తి

సోమవారం 20 ఫిబ్రవరి 2023



పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయిలో గల పోలీస్ స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆదివారం సందర్శించారు, రెగ్యులర్, ఎన్‌ఫోర్స్ మెంట్ డ్యూటీల గురించి అడిగి తెలుసు కున్నారు. అనంతరం రికారులను పరిశీలిం చారు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలతో మమేకం కావాలని సూచిం చారు. ఆయన వెంట ఎస్సై పి కిషోర్ వర్మ తదితరులు ఉన్నారు .



రికార్డులను పరిశీలిస్తున్న డిఎస్‌పి కృష్ణారావు

దళితుల భూమి కబ్జా

- భూస్వామితో రెవెన్యూ కుమ్మక్కు
- అమ్మని భూమిని ఆన్‌లైన్‌లో చూపి అధికారులు
- ఎదురించినవారిపై దౌర్జన్యం
- తహశీల్దార్ పై డిప్యూటీ సిఎం ఆగ్రహం



కబ్జాకు గురైన దళితుల భూమి

ప్రజాశక్తి - సాలూరు

రెవెన్యూ అధికారులకు మామూళ్లు సమర్పించుకుంటే అక్రమం, సక్రమం అన్న అంశాలతో సంబంధం ఉండదు. పేదల వైపు న్యాయం ఉన్నా డబ్బులు ముట్టజెప్పే భూస్వాములు, పెత్తందార్ల వైపే వారు కొమ్ము కాస్తారనేది రుజువైంది మండలంలోని దత్తివలసలో... రెవెన్యూ అండతో భూస్వామి పాల్పడిన భూకబ్జాకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

మండలంలోని కరాసువలస పంచాయతీ దత్తివలస రెవిన్యూ పరిధిలో దత్తివలసకు చెందిన దళితులకు, బొబ్బిలి పట్టణానికి చెందిన ఒక భూస్వామి మధ్య గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. ఈ వివాదంలో దళితుల పక్షాన న్యాయం కనిపిస్తున్నా ఆధారాల్లేవనే సాకు చూపి రెవెన్యూ అధికారులు భూస్వామికి అండగా నిలుస్తున్నారు. కరాసువలస పంచాయతీ పరిధిలో దత్తివలసకు సమీపాన 1983లో సాగర్ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే కోట్లాది రూపాయల వస్తుందని సంబంధిత యజమాని ఈ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ నెలకొల్పారు. ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవసరమైన భూమిని దత్తివలసకు చెందిన దళితుల నుంచి కొనుగోలు చేశారు. అప్పుడు ఫ్యాక్టరీ ఏర్పాటుకు భూములు విక్రయించిన దళితుల పూర్వీకులు 1956లో 30ఎకరాల భూములు కొనుగోలు చేశారు. ఆ మొత్తం భూమిలో సర్వే నెంబర్ 132లో 6.9ఎకరాలు, సర్వే నెంబర్ 133/2లో 4ఎకరాల భూమి మాత్రమే సిమెంట్ ఫ్యాక్టరీ యజమానికి దళితులు విక్రయించినట్లు ఆధారాలు వున్నాయి. దత్తివలసకు చెందిన సామలాపల్లి రాజారావు, తిరుపతి రావు, సాధనరావు, నాగేశ్వరరావు తమ భూములను ఫ్యాక్టరీ యజమానికి విక్రయించారు. వారు 11ఎకరాలు మాత్రమే ఫ్యాక్టరీకి విక్రయిస్తే మిగిలిన భూమి కూడా తమ వినియోగానికి ఇవ్వాలని, భూములిచ్చిన దళితుల కుటుంబాలకు చెందిన వారికి ఒక్కో ఉద్యోగం ఇస్తానని యజమాని దళితులకు హామీ ఇచ్చారు. ఆ భూములు విక్రయించిన సమయానికి భూముల్లో సరైన పంటలు పండక ఆదాయం రాకపోవడంతో దళితులు ఉద్యోగాలకు ఆశపడి భూములను ఫ్యాక్టరీ యజమానికి ఇచ్చారు. దళితులతో కుదిరిన ఒప్పందం ప్రకారంగానే ఫ్యాక్టరీ యజమాని వారి కుటుంబాల్లో ఒక్కొక్కరికి ఉద్యోగాలిచ్చారు. అలా ఫ్యాక్టరీ కొన్నాళ్లు నడిచిన తర్వాత నష్టాల పేరుతో యజమాని దాన్ని మూసేశారు. ఏజెన్సీ ప్రాంతంలో ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి కోట్లాది రూపాయల సబ్సిడీ కాజేసిన తర్వాత మూసివేయడంతో చాలా మంది ఉపాధి కోల్పోయారు. కొన్నేళ్ల తర్వాత యజమాని ఫ్యాక్టరీ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు విక్రయించారు. దళితుల నుంచి కొనుగోలు చేసిన భూములను మాత్రమే ఫ్యాక్టరీ యజమాని విక్రయించారు. అలా ఈ భూములు ఇద్దరు వ్యక్తుల చేతుల్లోకి మారాయి. తాము విక్రయించని భూములు తమకే వుంటాయని దళితులు భావించారు. 2019లో వడ్లమాని శ్రీరాములు అనే వ్యక్తి ఈదుబిల్లి జ్యోతీశ్వరి, బొడ్డు జయలక్ష్మికు విక్రయించారు. అయితే వాస్తవంగా దళితులు ఫ్యాక్టరీకి విక్రయించిన భూములు 11ఎకరాలు మాత్రమే. మిగిలిన భూములు వారి పేరిట వుండాలి. కానీ దళితులు విక్రయించని భూములు కూడా ఒన్-బిలో ఈదుబిల్లి జ్యోతీశ్వరి, బొడ్డు జయలక్ష్మి పేరిట కనిపించాయి. గతంలో పనిచేసిన తహశీల్దార్ ముడుపులు తీసుకుని దళితులు విక్రయించని భూములను భూస్వాముల పేరిట ఆన్ లైన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న దళితులు గత ఆరు నెలలుగాతహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తాము విక్రయించని భూములను మండలం రెవెన్యూ అధికారులు భూస్వామి పేరిట ఆన్‌లైన్ చేశారని, తమకు రావాల్సిన 13ఎకరాల భూమి ఇప్పించాలని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, విఆర్‌ఒలు క్షేత్ర స్థాయికి వెళ్లి విచారణ చేపట్టారు. దళితులు విక్రయించిన భూములు 11ఎకరాల భూమి అయితే మొత్తం భూమి ఆన్ లైన్‌లోకి ఎలా ఎక్కిందనేది తేల్చకుండా దళితుల వద్ద ఆధారాలు లేవని, భూములు ఈదుబిల్లి జ్యోతీశ్వరి, బొడ్డు జయలక్ష్మి సాగులో ఉన్నాయని నివేదిక అందజేశారు. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన, ఇప్పుడు పని చేస్తున్న రెవెన్యూ అధికారులు భూస్వామికి అండగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూస్వామి నుంచి పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని దళితులకు అన్యాయం చేయడానికి రెవెన్యూ అధికారులు సిద్ధమయ్యారనేది స్పష్టంగా కనిపిస్తోంది.

డిప్యూటీ సిఎంకు ఫిర్యాదు

తాము విక్రయించని భూములను తమకు ఇప్పించాలని కోరుతూ దత్తివలసకు చెందిన దళితులు డిప్యూటీ సిఎం రాజన్నదొరకు ఫిర్యాదు చేశారు. ఫ్యాక్టరీకి తాము 11ఎకరాలు మాత్రమే విక్రయిస్తే మొత్తం భూమిని ఆన్‌లైన్‌లో రెవిన్యూ అధికారులు ఎక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై డిప్యూటీ రాజన్నదొర మండల ఇన్‌ఛార్జి తహశీల్దార్ భానుప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడుతూ దత్తివలస దళితుల భూ సమస్యపై ఆగ్రహించారు.సమస్య పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలుస్తోంది. రూరల్ పోలీసు స్టేషన్ అధికారికి కూడా ఫోన్ చేసి దళితుల పై దౌర్జన్యం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని రాజన్నదొర ఆదేశించారని దళితులు చెప్పారు.

దళితులపై దాడికి భూస్వామి యత్నం

గత కొంతకాలంగా దళితులు విక్రయించని భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని వారి కుటుంబీకులు అడ్డుకుంటున్నారు. ఈ భూముల్ల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు భూస్వామి ఈదుబిల్లి జ్యోతీశ్వరి భర్త శ్రీనివాసరావు ప్రయత్నిస్తున్నారు. తాము విక్రయించని భూములను వదిలేసి మిగిలిన భూమి చుట్టూ నిర్మాణాలు చేపట్టాలని దళితులు వాదిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం భూస్వామి తన గ్రామానికి చెందిన సుమారు 60మంది అనుచరులను ఆటోల్లో తీసుకొచ్చి భూమిపై ఉన్న దళితులపై దౌర్జన్యం చేశారు. ఈమేరకు దళితులు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.





సదస్సులో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వరరావు; హాజరైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు

సమస్యలపై పోరుకు కలిసి రావాలి

యుటిఎఫ్ సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీలైన సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్, బకాయిలు డిఎల చెల్లింపు, సక్రమంగా జీతాల చెల్లింపుపై యుటిఎఫ్ చేస్తున్న పోరాటాలకు అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు కలిసి రావాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక లయన్స్ కల్యాణ మండపంలో యుటిఎఫ్ రెండో జిల్లా కౌన్సిల్ సమావేశంలో జరిగిన విద్యాసదస్సులో ఉపాధ్యాయులపై దాడి, మన కర్తవ్యం, సిపిఎస్‌రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్, హామీలు, మనకర్తవ్యం అన్న అంశాలపై ప్రసంగించారు. తొలుత పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం అమలు పేరిట కేంద్రంలోని బిజెపి మెప్పు పొంది, తద్వారా స్వంత ప్రయోజనాలు కాపాడుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని విద్యావ్యవస్థను బలిపీఠంపై కూర్చోపెట్టిందని విమర్శించారు. విద్యాసంస్కరణల పేరిట ప్రాథమిక విద్యను రాష్ట్రంలో పూర్తిగా ధ్వంసం చేసే విధానాలను ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. ఇందులో భాగంగానే 3,4,5, తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం, 10మంది విద్యార్థుల కన్నా తక్కువ ఉన్న పాఠశాలల విలీనానికి రంగం సిద్ధం చేసిందని తెలిపారు. నాడు-నేడు పేరిట సంస్కరణలు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ముందు ఉపాధ్యాయుల ఖాళీలు భర్తీచేయాలన్నారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలను శాసనమండలిలో ప్రశ్నించి, ప్రభుత్వాన్ని దోషిగా నిలబెడుతున్నారని, అందుకే రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆర్‌జెడి ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులను ఓట్లు అడిగే ముందు వారికి మీరు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. అనంతరం యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయంగా బైజూస్‌తో పాటు ఇతర 13యాప్‌ల ద్వారా వారిపై తీవ్రమైన ఒత్తిడి పెంచిందన్నారు. తాము పర్యవేక్షణకు వ్యతిరేకం కాదని, పర్యవేక్షణ పేరిట అనుసరిస్తున్న అస్తవ్యస్థ విధానాలను ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రకార్యదర్శి సిహెచ్ రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయులపైనే కాకుండా అన్ని వర్గాల ప్రజలపై జరుగుతున్న దాడిని గుర్తించి, రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వంపై పోరాడాల్సిన అవసరాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్, బకాయి డిఎల చెల్లింపు, సక్రమంగా జీతాల చెల్లింపులుపై జరుపుతున్న పోరాటాలకు కలిసి రావాలని కోరారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసన మండలి పిడిఎఫ్ అభ్యర్థి కె.రమాప్రభ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విద్యార్థి, సమస్యలపై ఎన్నోఏళ్లుగా శాసనమండలిలో ప్రశ్నిస్తూ, చిత్తశుద్ధితో పనిచేసి సమస్యలను పరిష్కరిస్తున్నది పిడిఎఫ్ ఎమ్మెల్సీలేనని అన్నారు. శాసనమండలిలో వారి సంఖ్యను పరిమితం చేయడానికి రాబోవు ఎన్నికల్లో వారిని శాసనమండలిలో అడుగుపెట్టనివ్వకుండా చేయడానికి అధికార ప్రభుత్వం అనేక ప్రలోభాలకు పాల్పడుతుందని విమర్శించారు. వీరి చర్యలను గమనించి నిజాయితీ, చిత్తశుద్ధి గల పిడిఎఫ్ అభ్యర్థులను గెలించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. సదస్సులు పెద్దఎత్తున ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

సదస్సు అనంతరం యుటిఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎన్నికైంది. రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.రవీంద్ర ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఈ ఎన్నికలో జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎ.భాస్కరరావు, అధ్యక్షులుగా టి.రమేష్, సహాధ్యక్షులుగా బి.విజయకుమార్, మహిళా సహాధ్యక్షులుగా వి.జ్యోతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మురళీమోహనరావు, కోశాధికారి కె.మురళీ, కార్యవర్గసభ్యులు ఎన్నికయ్యారు.

జన జాతర

మహాశివరాత్రి జాతరకు జనం పోటెత్తారు. రెండోరోజు ఆదివారం పుణ్యగిరి, రామతీర్థం ఆలయాలకు వేల సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. పుణ్యగిరికి వెళ్లే మార్గమంతా ప్రజలతో కిక్కిరిసింది. రామతీర్థంలో రోడ్లన్నీ జనంతో కిటకిటలాడాయి.



నెల్లిమర్ల.. రామతీర్థం ఆలయం వద్ద యాత్రికులు



నడుకూరు వద్ద చెరకు, అరటి పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

ఏనుగుల సంచారంతో
బిక్కుబిక్కుమంటున్న జనం

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని గత మూడు రోజులుగా గజరాజులు గుంపు తిష్ట వేయడంతో బిక్కు బిక్కు మంటూ కాలం వెలదీస్తున్నారు. విజయనగరం జిల్లా వంగర మండలం తలగాం, వీర గట్టం మండలం నడుకూరు, కిమ్మి గ్రామాలకు సమీపాన ఉన్నాయి. నడుకూరుకు చెందిన ఎం.సన్యాసినాయుడు చెరకు తోటలో గజరాజుల గుంపు తిష్ట వేశాయి. ఆదివారం ఉదయం 11 గంటల వరకు చెరుకు తోటలో ఉన్న గజరాజుల గుంపు వీరఘట్టం సమీపంలో రమేష్ దాస్ మామిడితోటలో బసవేసాయి. వీటి కదలికలను ట్రాకర్స్ ఎప్పటికప్పుడు ఫారెస్ట్ అధికారులకు సమాచారం చేరవేస్తున్నారు. వీరఘట్ట- నడుకూరు గ్రామాలకు అతి సమీపంలో గజరాజులు గుంపు ఉండడంతో ప్రజలు తీవ్ర భయాందోనకు గురవుతున్నారు. గజరాజుల సంచారంతో రౌతు రామారావు, ఎం.సన్యాసినాయుడు, కోడి తాతబాబు, వాసు దేవరావులకు సంబంధించి చెరకు, మొక్కజొన్న పంట పూర్తిగా నాశనమైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గుంపులో ఉన్న హరి ఏనుగు మూలలంక నుంచి కొమరాడ మండలం గుణానుపురంలో సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం చీకటి పడుతున్న సమయంలో ఈ గజరాజుల గుంపు ఎటు సంచరిస్తాయో తెలియని పరిస్థితిలో మండల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు.

ఆందోళనలో రైతన్నలు

మండలంలో గత మూడు రోజులుగా గజరాజులు గుంపు సంచరించడంతో అన్నదాతల ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు లేక ఎక్కడికక్కడే బస్తాలు కుప్పలు కుప్పలుగా కళ్లాల్లో పడి ఉన్నాయి. ఏనుగులు ధాన్యం బస్తాలను ధ్వంసం చేస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఉపాధి కూలీలు పనులు చేసేందుకు వెళ్లలేక ఇళ్లకే పరిమితం అవుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఏనుగులను తమ ప్రాంతం నుంచి తరలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు, కూలీలు అధికారులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

వైసిపికి మరిశర్ల గుడ్‌బై!

బొబ్బిలి : వైసిపి సీనియర్ నాయకులు, కౌన్సిలర్ మరిశర్ల రామారావునాయుడు ఈ నెల 23న అధికార పార్టీకి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయనున్నట్లు పట్టణంలో చర్చ సాగుతోంది. వైసిపి ఆవిర్భావం నుంచి బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారు. సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే బొబ్బిలి, పార్వతీపురం నియోజకవర్గాలను ఆయన ప్రథమ స్థానంలో నిలిపారు. వైసిపిలో బొబ్బిలి రాజులు చేరడంతో మరిశర్ల రామారావు ఆ పార్టీకి దూరమయ్యారు. 2019 ఎన్నికల ముందుకు తిరిగి వైసిపిలో చేరిన మరిశర్ల ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు విజయానికి ఎంతో కృషి చేశారు. అనంతరం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్ పదవి ఆశించి, వైసిపి నుంచి కౌన్సిలర్‌గా పోటీ చేసి విజయం సాధించారు. మున్సిపల్ చైర్మన్ పదవి రాకపోవడం తో అప్పటి నుంచి పార్టీతో అంటిముట్టనట్లు వ్యవహరిస్తూ వస్తున్నారు. వైసిపిలో మరిశర్లకు ప్రాధాన్యత తగ్గడంతో పార్టీ సభ్యత్వానికి, కౌన్సిలర్ పదవికి రాజీనామా చేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది.

'వెనుకబడిన ఉత్తరాంధ్రకు అనాదిగా అన్యాయం జరుగుతోంది. వ్యవసాయం, వైద్యం, విద్య, ఉపాధి రంగాల్లో తగిన పురోగతిలేదు. ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయలేదు. రెగ్యులరైజేషన్ చేయక ఏళ్ల తరబడి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అనేక వెతలు పడుతున్నారు. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాల కల్పన జిఒ అమలు చేయడంలేదు. ఎన్ఎబిబి ఇతర నిర్వాసిత సమస్యలు పరిష్కరించడం లేదు. షెడ్యూల్ ప్రాంతంలో జిఒ 3కు చట్టబద్ధత కల్పించి ఉద్యోగాల భర్తీ చేయడంలేదు. ఇచ్చిన హామీ ప్రకారం సిపిఎస్‌ను రద్దుచేయలేదు. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కష్టకాలంలో ఆదుకొనేందుకు సంక్షేమబోర్డు వంటివి లేవు. ఇలా అనేక సమస్యలతో సతమతమవుతున్న ఉత్తరాంధ్ర ప్రజల బాధనూ, ఘోషనూ, ఆవేదననూ, వివక్షనూ శాసనమండలిలో గొంతెత్తి పోరాడుతున్న శక్తులకు అండగా నిలబడతాను. ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తాను' అని సామాజిక కార్యకర్త, 250 పైచిలుకు ప్రజా సంఘాలు బలపరిచిన ఉత్తరాంధ్ర పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఎన్నికల అజెండా, విజయం సాధిస్తే కేంద్రీకరించి పనిచేసే అంశాలను వివరించారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

- ప్రజాశక్తి, అనకాపల్లి ప్రతినిధి

- సిపిఎస్ రద్దుకు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్‌కు కృషి
- గిరిజన ప్రాంతంలో జిఒ 3 చట్టబద్ధతకు పోరాటం
- స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ముందుంటా..
- 'ప్రజాశక్తి'తో ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ




ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధే లక్ష్యం

ఉన్నత చదువులు చదివి, ఉద్యోగావకాశాలను వదులుకొని సామాజిక సేవను ఎందుకు ఎంచుకున్నారు ?

మా కుటుంబ నేపథ్యం అటువంటిది. గ్రామీణ వాతావరణంలో పెరగడం, చదువు పూర్తయ్యాక గిరిజన, నగర, శ్రామిక మహిళల సమస్యలను అధ్యయనం చేస్తూ, పరిష్కారం కోసం పనిచేశాను. వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలన్న ఆలోచనతో అగ్రికల్చర్ బిఎస్సీ పూర్తిచేశాక పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రాంతంలో పనిచేశాను. కొండల్లో గిరిజనుల నివాసాలు, వారి భాషలు, సంప్రదాయాలు, సంస్కృతి, ప్రకృతిపైనా ఆసక్తివుండడంతో గిరిజన ప్రాంతం ఎంచుకున్నాను. గిరిజన గూడెల్లో వారితోపాటు ఉంటూ జీడి మామిడి తోటల పెంపకంపై అవగాహన కల్పించడం, వారితో కలిసి తోటలు పెంపకంలో భాగస్వామి అయ్యాను. గుమ్మలక్ష్మీపురం ప్రాంతంలో నాణ్యమైన జీడిపిక్కల విత్తనాల కోసం పెద్ద పోరాటం నడిపి, నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయించగలిగాను. 'మేనేజ్' అనే సంస్థ ద్వారా రీసెర్చ్ ప్రాజెక్టులో రంపచోడవరంలోని గిరిజన ప్రాంతంలో పనిచేసినప్పుడు గిరిజన వ్యవసాయంలో చిరుధాన్యాల పంటలకు ప్రాధాన్యత ఇచ్చేలా కృషి చేశాను. వివాహ రీత్యా విశాఖ నగరానికి రావడంతో.. ప్రభుత్వ ఉద్యోగం కాకుండా, పేదలకు సేవలందించే స్వచ్ఛంద సంస్థల్లో పనిచేయాలని అనుకున్నాను.

మిమ్మల్ని ప్రభావితం చేసిన అంశాలేంటి?

వ్యవసాయం, వ్యవసాయ పనిచేస్తున్న వారితోవున్న అనుబంధం, అన్నయ్య, అక్క, తమ్ముడు విద్యార్థి ఉద్యోగ, ఉపాధ్యాయ ఉద్యమాల్లోనూ పనిచేయడం, దీనికితోడు బొబ్బిలి మండలం నారసింహునిపేట సర్పంచ్‌గా సుదీర్ఘకాలంపాటు పనిచేసిన మా తాతగారు మద్రాపు పోతినాయుడు ప్రభావం నాపై బలంగా పడింది. బాల్యంలో ఆయన దగ్గర పెరగడం, చదవడంతో దళితులు, ఇతర సామాజిక తరగతులను ఆయన ప్రేమగా, సమానంగా చూడ్డం అతిసమీపం నుంచి చూశాను. ఉపాధ్యాయులు బాగుంటే, పిల్లలకు విద్యాబోధన బాగుంటుందని ఉపాధ్యాయుల పట్ల చాలా అభిమానం చూపేవారు. నా బాల్యం నుంచే ప్రభావితం కావడానికి ఇవన్నీ దోహదపడ్డాయి.



? మీరు చేపట్టిన ప్రధాన సేవా కార్యక్రమాలేంటి?


వివాహరీత్యా విశాఖ నగరానికి రావడంతో జాతీయ స్వచ్ఛంద సంస్థ 'ధాన్ ఫౌండేషన్'లో రెండు దశాబ్దాలకుపైగా పనిచేశాను. నా ఆలోచనలకు తగినట్లే పేదరిక నిర్మూలన, రైతులు, చెరువుల అభివృద్ధి వంటి అంశాలపై పనిచేసే క్రమంలో 33 వేల మంది పేద మహిళలతో స్వయం ప్రతిపత్తి కలిగిన మహిళా సమాఖ్యలను ఏర్పాటు చేశాను. ఈ క్రమంలో బ్యాంకులు, ఇన్సూరెన్స్, ఇతర ప్రభుత్వ సంస్థలు, ఆరోగ్య సంస్థలు, వృత్తి శిక్షణా సంస్థలతో అనుసంధానం చేసుకొని పేద మహిళలకు, వారి కుటుంబాలకు సేవలందించాను. అంగన్‌వాడీ, ఆశా, శ్రామిక మహిళలు పనిచేసే ప్రాంతంలో వారెదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేకంగా పనిచేశాను. మెటర్నిటీ లీవ్ సదుపాయం, లైంగిక వేధింపుల కమిటీలు, ప్రత్యేక మరుగుదొడ్లు వంటి ఏర్పాటు చేయగలిగేలా చేశాను. ఎస్ఇజెడ్‌లో గార్మెంట్ కార్మికుల సమస్యలపై పనిచేసినప్పుడు భారత ప్రతినిధిగా ఆసియా దేశాల్లో వారి సమస్యలపై మాట్లాడాను. నా జీవిత భాగస్వామి డాక్టర్ బి.గంగారావు ప్రజలకు సేవచేసే వ్యక్తి కావడంతో నా సామాజిక సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నాను. 2010 నుంచి మురికివాడల్లోని పేద కుటుంబాల పిల్లల కోసం వైజాగ్ చిల్డ్రన్ క్లబ్ (విసిసి) ఏర్పాటుచేశాను. పిల్లల్లో సమిష్టితత్వం పెంచడం, సామాజిక స్పృహ, శాస్త్రీయ ఆలోచనలు వారిలో పెంపొందించడం సంతృప్తినిచ్చాయి. పేద కుటుంబాల పిల్లలకు ప్రత్యేకంగా ట్యూషన్ సెంటర్లు నడుపుతున్నాం.

? మీరు విజయం సాధిస్తే ఏ సమస్యలపై కేంద్రీకరించి పనిచేస్తారు?

నా అభ్యర్థిత్వాన్ని బలపర్చి పనిచేస్తున్న 250కిపైగా ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ప్రజాసంఘాల సమస్యలు పరిష్కారానికి, ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీకి కృషి చేస్తాను. విభజన చట్టం హామీల అమలుకు కృషిచేస్తాను. పెట్రోలియం, గిరిజన యూనివర్శిటీ పూర్తికి, మెట్రో రైల్, రైల్వే జోన్‌పై మండలిలో ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాను. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా జరుగుతున్న పోరాటాలకు అండగా వుంటాను. సొంత గనులు సాధనకు కృషి చేస్తాను. సిపిఎస్ రద్దుకు ఉద్యోగులు చేస్తున్న పోరాటాలకు అండగా వుంటాను. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్, ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీకి కృషి చేస్తాను. సెజ్‌లో పరిశ్రమలకు రాయితీలు కల్పించినట్లు, ఉపాధి కేంద్రాలుగావున్న చిన్నచిన్న విద్యా సంస్థలకు రాయితీలు కల్పించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరుతాను. గిరిజన ప్రాంతంలో జిఒ 3 ప్రకారం ఉద్యోగాల భర్తీచేయాలి. ప్రయివేటు విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంక్షేమం కోసం వెల్ఫేర్ బోర్డు ఏర్పాటుచేసేలా పట్టుబడతాను. పరిశ్రమల్లో స్థానిక యువతకు 75 శాతం ఉద్యోగాలు లభించేలా కృషి చేస్తాను. విశాఖలో పంచగ్రామాల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తాను. ఉత్తరాంధ్రకు జరుగుతున్న అన్యాయంపై ఉత్తరాంధ్ర ఆడపడుచుగా నీతి, నిజాయతీ, నిబద్ధతతో మండలిలో పట్టభద్రులు, ఉద్యోగులు, కార్మికులు, ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తాను.

? ఎన్నికల ప్రచార అజెండా ఏంటి?

ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్దే ప్రధాన ప్రచార ఎన్నికల అజెండా. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధిలో ఈ ప్రాంతం వెనుకబడివుంది. వ్యవసాయం అభివృద్ధి చెందకపోవడంతో వెనుకబాటుతనం కొనసాగుతోంది. వెనుకబడిన ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందాలంటే ఉత్తరాంధ్ర స్పెషల్ ప్యాకేజీ అమలుచేయాలి. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, చిన్ననీటి ప్రాజెక్టులు పూర్తిచేయాలి. కొత్త పరిశ్రమలు రావాలి. ఐటి హబ్‌ని అభివృద్ధి చేయాలి. ఇవి కాకుండా అనేక సమస్యలు సుదీర్ఘకాలంగా వున్నాయి. వీటన్నింటినీ పట్టభద్రులు, ఉపాధ్యాయ, ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్తున్నాను.



పాలకొండలో ప్రచారం చేస్తున్న సిఐటియు, జెవివి, జెఎసి నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలి

పాలకొండ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.ఉమామహేష్, జాయింట్ యాక్షన్ కమిటీ పి.ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ అమలు కోసం విశాఖ స్టీల్ ప్లాంట్‌తో సహా పబ్లిక్ సెక్టార్ కాపాడుకోవడానికి సిపిఎస్ రద్దు ఒపిఎస్ పునరుద్ధరణకు కాంటాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్, ప్రైవేటు విద్యాసంస్థల ఉద్యోగ ఉపాధ్యాయులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుతో పాటు ఉత్తరాంధ్ర ఉద్యమాలకు బలపర్చేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక పెన్షనర్ల తదితర రంగాల సమస్యలు పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థిని గెలిపించాలని, గ్రాడ్యుయేషన్ ఓటర్లకు మీ కుటుంబ సభ్యులకు, స్నేహితులకు తెలియజేసి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



చిన్నారులకు చాక్లెట్లు అందజేస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్

పాఠశాలకు వెళ్తున్నారా?

ప్రజాశక్తి - వీరఘట్టం

మీరు పాఠశాలకు వెళ్తున్నారా? లేదానని వీరఘట్టం- పాలకొండ ప్రధాన రహదారిలో ఇటుక తయారీ కేంద్రాలను ఆదివారం పాలకొండ సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లలపై బాధ్యత తీసుకొని క్రమం తప్పకుండా అందుబాటులో ఉన్న పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం చత్రపతి జన్మదిన సందర్భంగా చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేశారు.



భామినిలో ప్రచారం చేస్తున్న టిడిపి నాయకులు

భవిష్యత్తును అంధకారం చేస్తున్న వైసిపి

ప్రజాశక్తి - భామిని

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం భవిష్యత్తును అంథకారంలో నెట్టేసిందని టిడిపి నాయకులు ఆరోపించారు. మండల కేంద్రమైన భామినిలో టిడిపి నాయకులు ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యులు, రోజు వారీ కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. వైసిపి వైఫల్యాలను తెలుసుకొని, రాష్ట్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలు టిడిపిని గెలిపించాలని పిలుపునిచ్చారు. తొలుత టిడిపి నాయకులు నందమూరి తారకరత్న మృతికి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, ప్రధాన కార్యదర్శి మెడిబోయిన జగదీశ్వరరావు, బిడ్డిక ప్రసాద్, కోరాడ రాజేష్, సర్పంచ్ లోపింటి రాజేష్, కొల్ల మధు, సాకేటి రామారావు, కృష్ణ చంద్ర దొర, గురిబిల్లి లక్ష్మిపాతి నాయుడు పిలుపునిచ్చారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

సీతంపేట : స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్క్ వద్ద ఆదివారం ఎఎస్ఐ శ్రీనివాసరావు వాహనాలు తనిఖీలు చేపట్టారు. మితిమీరిన వేగం వెళ్లరాదని ఓవర్ లోడ్ వేయరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహన చోదకులకు చెప్పారు. పరిమితి మించిన ప్రయాణికులు ఎక్కించడంతో ఆపరాద రుసుం వేశారు. లైసెన్సు సి-బుక్, ఇన్సూరెన్స్, పొల్యూషన్, హెల్మెంట్ తప్పనిసరిగా ఉండాలని అన్నారు



మినీ ట్రైన్‌లో చిన్నారుల సందడి

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట : స్థానిక ఎన్‌టిఆర్ అడ్వెంచర్ పార్కులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవుదినం కావడంతో పర్యాటకులు పార్క్‌కు తరలివచ్చారు. పార్క్‌లోని అందాలను ఆశ్వాదించారు. యువకులు బోటు షికారు చేశాయగా, యువతీ యువకులు హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. ఆనంద్ విహార వద్ద డాన్సులు వేశారు. చిన్నారులు మినీ ట్రైను నడుపుకుంటూ చిల్డ్రన్ పార్క్‌లో అల్లరి చేశారు. పలువురు గన్ షాట్ చేయగా, సాహస పేతమైన క్రీడల్లో పాల్గొన్నారు. అనంతరం మెట్టు గూడ జలపాతాన్ని సందర్శించారు.

ప్లాస్టిక్ నిషేధం జరిగేనా?

- విచ్చలవిడిగా వినియోగం
- ప్రమాదంలో ప్రజారోగ్యం
- పర్యావరణంపై తీవ్ర ప్రభావం
- నిషేధం అమల్లో ఉన్నా చోద్యం చూస్తున్న యంత్రాంగం



వెంకటరాయుని కోనురు వద్ద ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి ప్రమాదకరమని, వాతావరణంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిసినా దాని వినియోగం మాత్రం తగ్గడం లేదు. 50 మైక్రాన్స్ కన్నా తక్కువ ఉన్న ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించింది. దీన్ని పక్కాగా అమలు చేయాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా పట్టణ వీధులు, మురుగు కాలువలు ప్లాస్టిక్ కూపాలుగా మారుతున్నాయి. రోగాలు పెంచుతున్నాయి. ప్లాస్టిక్‌ను భూమిలో వేస్తే నేల కలుషితమవుతుంది. కాలిస్తే విషవాయువులు వాతావరణంలో కలిసి పర్యావరణం దెబ్బతింటుంది. జీవన మనుగడపై దుష్ప్రభావం కలిగించే ప్లాస్టిక్ నిషేధంలో నగర పంచాయతీ ఘోరంగా వైఫల్యమైందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

విచ్చల విడిగా వినియోగం...

డివిజన్ కేంద్రమైన పాలకొండ పట్టణంలో ప్లాస్టిక్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. మార్కెట్‌లో బహిరంగంగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నప్పటికీ వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించి పాలిథిన్‌ను విక్రయిస్తున్నారు. ప్లాస్టిక్ హోల్‌సేల్ షాపులపై ఇంతవరకు అధికారులు దృష్టిపెట్టిన దాఖలాల్లేవు. దేవరపేట, జెట్టివారివీధి తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ హోల్‌సేల్ దుకాణాలున్నాయి. వీటిపై అధికారులు దాడులు చేపట్టే పరిస్థితి లేదు. కిల్లీ కొట్టు నుంచి సూపర్‌మార్కెట్ వరకు యథావిధిగా ప్లాస్టిక్ విక్రయిస్తున్నారు. ఇది పారిశుధ్య నిర్వహణపై కూడా భారం పడుతుంది. రోజుకు 10 టన్నుల చెత్త సేకరించాల్సిన పరిస్థితి వస్తుంది. అయినప్పటికీ అధికారులు దీనిపైన దృష్టిపెట్టడం లేదు. గతంలో ఉన్న కమిషనర్ లిల్లీపుష్పనాథం హయాంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధించారు. ప్లాస్టిక్ వినియోగించే వారిపై కొరడా ఝులిపించారు. ఆయన కమిషనర్‌గా ఉద్యోగ విరమణ చేయడంతో తర్వాత పరిస్థితి యథావిధిగానే కొనసాగుతున్నది.

సచివాలయాల వ్యవస్థ ఉన్నా నిర్లక్ష్యమే....

సచివాలయాల్లో పర్యావరణానికి ప్రత్యేక కార్యదర్శిని ప్రభుత్వం నియమించినప్పటికీ ప్లాస్టిక్ నిషేధం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ముఖ్యంగా సచివాలయాలపై కార్యదర్శులు నిఘా పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. శానిటేషన్ కార్యదర్శులు దీనిపై దాడులు నిర్వహించి ఆయా సచివాలయాల పరిధిలో పూర్తిగా ప్లాస్టిక్ నిర్మూలించాల్సి ఉన్నప్పటికీ అటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

ప్రజల్లో చైతన్యం ఏదీ...

ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకునే ముందు ప్రజల్లో చైతన్యం కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. ప్రజల్లో ప్లాస్టిక్ వాడకాలపై వచ్చే అనార్థాలను వివరించి చైతన్య సదస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది. మహిళా సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తే కొంత మేలు చేకూరుతుంది. అదే విధంగా వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్లాస్టిక్ వినియోగిస్తే ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించాల్సిన అవసరం ఉంది.

దృష్టిపెడతాం

ప్లాస్టిక్ నిషేధంపై దృష్టిపెడతాం. సచివాలయ సిబ్బందికి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం. వ్యాపారులతో దీనిపై సమావేశాలు కూడా నిర్వహించాం. ప్రజల్లో చైతన్యం రావాల్సి ఉంది.

-సర్వేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్, పాలకొండ

శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి జగన్మోహనరావు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, శిశు ఆరోగ్య కార్యక్రమాలన్నీ పక్కగా జరిగేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్టు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శిశు ఆరోగ్యంపై వైద్యారోగ్యశాఖ సూచనలు పాటిస్తూ, ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామన్నారు. వీరికి సంబంధించిన అన్ని ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను పూర్తి స్థాయిలో అమలు చేసేలా, చిన్నారులకు వైద్య సేవలు, వైద్య సదుపాయాలు వినియోగపడేలా తగు చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు. బిడ్డపుట్టినప్పటి నుంచి షెడ్యూల్ ప్రకారం వ్యాధినిరోధక టీకాల నిర్వహణ అటు క్షేత్ర స్థాయిలోనూ ఇటు ఆరోగ్య కేంద్రాల్లోనూ, ముందస్తుగానే ఆ పరిధిలో ఆ తారీఖున ఉండే టీకా అర్హుల జాబితాను సిద్ధం చేసుకొని వారికి తెలియజేయడం, వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అలాగే నవజాత శిశువుల ఆరోగ్యం దృష్ట్యా ఎప్పటికప్పుడు గృహ సందర్శన ద్వారా ఆరోగ్య పర్యవేక్షణ, అందుకోసం ఆశా కార్యకర్తలకు ఇవ్వబడిన హెచ్‌బిఎన్‌సి కిట్లను ఉపయోగించి ఏవైనా అనారోగ్య లక్షణాలు గుర్తించినచో వెంటనే వైద్యుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిన్నారుల్లో నిమోనియా, ఇతర శ్వాసకోశ సంబంధమైన అనారోగ్య లక్షణాలు గుర్తించి, నివారించే దృష్ట్యా వైద్య, ఆరోగ్య శాఖ ప్రవేశపెట్టిన శాన్స్ సర్వే ద్వారా వైద్య సిబ్బంది ఇప్పటికే ఐదేళ్లలోపు పిల్లల ఆరోగ్య సర్వే దాదాపుగా పూర్తి చేస్తున్నారని, అనారోగ్య లక్షణాలు గుర్తించిన వారికి అవసరమైన మందులు, చికిత్స ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. చిన్నారుల్లో రక్తహీనత నివారణకు వారానికి రెండు సార్లు ఐరన్‌సిరప్‌లను ఇస్తున్నారని, అలాగే అంగన్వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు సందర్శించి పిల్లల ఆరోగ్య పర్యవేక్షణ చేస్తూ పౌష్టికాహార లోప/ఎదుగుదల లోప పిల్లలను గుర్తిస్తే వెంటనే సంబంధిత ఎన్‌ఆర్‌సి కేంద్రాలకు రిఫర్ చేయడం జరుగుతుందని తెలిపారు. హైరిస్క్ గర్భిణీలను ప్రసవ తేదీకి ముందుగానే నిర్దేశించిన ఆసుపత్రిలో చేర్పిస్తే అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంటూ మాతా, శిశు మరణాలు సంభవించకుండా జాగ్రత వహించడం జరుగుతుందని అన్నారు. శిశువుకు అవసరమయ్యే అత్యవసర వైద్య సేవ కేంద్రాలైన ఎన్‌ఐసియు, ఎస్ఎన్‌సియు అందుబాటులో ఉన్నాయన్నారు. చిన్నారుల ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణపై వైద్య శాఖ, ఐసిడిఎస్ సమన్వయంతో సమావేశాలు నిర్వహిస్తూ ప్రగతి నివేదికలను పరిశీలిస్తాయన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, వైద్యులు, సిబ్బంది సూచనలను పాటించాలని కోరారు.

బిసి-ఎఫ్ ధ్రువీకరణ మంజూరుపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సాలూరు

2021లో వైసిపి ప్రభుత్వం జారీ చేసిన జీవో 66 ప్రకారం కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులస్తులకు బిసి-ఎఫ్ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ పట్టణ తెలగా సంఘం నాయకులు ఆదివారం ముఖ్యమంత్రి స్పందనకు ఫిర్యాదు చేశారు. పట్టణ తెలగా సంఘం అధ్యక్షులు వి.సుదర్శనరావు, ప్రధాన కార్యదర్శి జె.సీతారాం టెలిగ్రాం ద్వారా సిఎం జగన్ మోహన్ రెడ్డి నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. జీవో ప్రకారం మండల రెవెన్యూ కార్యాలయాల్లో బిసి ఎఫ్ ధ్రువీకరణ పత్రాలు మంజూరు కావడం లేదని చెప్పారు. దీనివల్ల వేలాది మంది నిరుద్యోగ యువకులు, విద్యార్థులు నష్టపోతున్నారని చెప్పారు. తక్షణమే ధ్రువీకరణ పత్రాలు మంజూరుకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

21న జాబ్‌మేళా

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

స్థానిక తమ్మి నాయుడు డిగ్రీ కాలేజీలో ఈ నెల 21 మంగళవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో హేటరో డ్రగ్ ఫార్మా కంపెనీలో ఖాళీలు భర్తీ చేయడానికి నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ జాబ్ మేళాకు 18 నుంచి 25 సంవత్సరాలు లోపు వయస్సు గల బిఏ, బికాం, బిఎస్సి అభ్యర్థులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9182398325 నంబరును సంప్రదించాలని కోరారు.

తారకరత్నకు నివాళి



తారకరత్నకు నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరంజీవులు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

సినీనటుడు నందమూరి తారకరత్నకు పట్టణ నందమూరి అభిమాన సేవా సంఘం ఆధ్వర్యంలో అభిమాన సంఘ సభ్యులు ఆదివారం స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ నందమూరి తారకరత్న ఒక ప్రచారకార్యక్రమంలో అకస్మికంగా స్పర్శ కోల్పోయి మెరుగైన వైద్యం నిమిత్తం బెంగళూరులో ఉన్న నారాయణ హృదయాలయం ఆసుపత్రిలో 23 రోజులుగా ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో వైద్యచికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచిపెట్టడం బాధాకరమని అన్నారు. నందమూరి తారకరత్న ఎన్నో సినిమాల్లో హీరోగా, విలన్‌గా నటించి అభిమానులను, ప్రేక్షకులను ఎంతగానో అలరించారని అన్నారు. 40ఏళ్ల వయస్సులో పరమపదించడం యావత్ నందమూరి అభిమానులకు తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పార్వతీపురంరూరల్ : నందమూరి తారకరత్న మృతికి పార్వతీపురం టిడిపి నాయకులు సంతాపం తెలిపారు. మండలంలోని కృష్ణపల్లిలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జీ బొబ్బిలి చిరంజీవులు, ఎఎంసి మాజీ చైర్మన్ రెడ్డి శ్రీనివాసరావుతో కలిసి ఆయన చిత్రపటానికి నివాళ్లు అర్పించారు. పట్టణ కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ డి.శ్రీదేవి, పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు జి.రవికుమార్, దొగ్గ మోహనరావుతో కలిసి నివాళ్ల అర్పించారు. పట్టణంలోని పాత బస్టాండ్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం ఎదుట పట్టణ నందమూరి అభిమాన సంఘం సభ్యులు, పాకలసన్యాశిరావు, జివెంకటరమణ అద్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంతాపం ప్రకటించారు.

ప్రభుత్వ విధానాలతో ప్రాథమిక విద్య విధ్వంసం



సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జాతీయ విద్యా విధానం పేరుతో ప్రాథమిక పాఠశాలల ఉనికిని ప్రభుత్వం ప్రశ్నార్థకం చేస్తుందని, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై వేధింపులకు దిగుతుందని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దుర్గారావు, నల్లా బాలకష్ణారావు అన్నారు. ఆదివారం పార్వతీపురంలో జరిగిన సబ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. విలీనం పేరుతో 3,4,5 తరగతులను ఆదరాబాదరాగా ఉన్నత పాఠశాలల్లో అశాస్త్రీయమైన విధానం ద్వారా చేర్చడం, ఉన్నపళంగా ఉపాధ్యాయుల పనిభారాన్ని పెంచడం జరిగింది. ఇప్పుడు పదిమంది విద్యార్థుల కన్నా తక్కువ రోల్ ఉండే పాఠశాలలను కూడా ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడానికి ప్రయత్నించడం విద్యా వ్యవస్థను నాశనం చేయడమేనని విమర్శించారు. ఆ ప్రజాస్వామిక విధానాలను ప్రశ్నిస్తున్న ఉపాధ్యాయ సంఘాలను నిరంకుశంగా అణిచివేయడానికి ఉపాధ్యాయులపై ప్రభుత్వ అధికారులను ఉసికొల్పడం సరైన చర్య కాదని, సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం పిలుపునందుకొని జిల్లాలోని అనేక తాలూకా కార్యాలయాల్లో సంబంధిత తహశీల్దార్ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని అన్నారు. సోమవారం మరిన్ని మండలాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బాలకృష్ణ తెలిపారు. 3,4,5 తరగతుల విలీనాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తప్పించాలని, పని సర్దుబాటు పేరుతో జరిగిన అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయడం, ఖాళీగా ఉన్న 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడంతో పాటు ప్రతినెలా మొదటి తేదీ నాటికే జీతాలు చెల్లించాలన్న ముఖ్యమైన డిమాండ్ల సాధనకు ఎపిటిఎఫ్ నాలుగు దశల్లో ఉద్యమాన్ని ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రావాడ అప్పలనాయుడు ఉపాధ్యక్షులు ప్రమీలరాణి పాల్గొన్నారు.

రెండో రోజు పోటెత్తిన యాత్రికులు

- జనసంద్రంగా మారిన పుణ్యగిరి
- కిటకిటలాడిన రామతీర్థం
- సేవకార్యక్రమాల్లో స్వచ్ఛంద సంస్థలు

ఉత్తరాంధ్ర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం, దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యగిరి ఆలయాలు శివరాత్రిని పురస్కరిం చుకుని రెండో రోజు కిటకిటలాడాయి. ఈ రెండు ప్రాంతాల్లోనే సుమారు లక్షకుపై గా భక్తులు వచ్చి ఉంటారని అంచనా వేస్తున్నారు. భక్తులు కోసం ఆలయాధికారులు ఏర్పాట్లు చేశారు. దారి పొడువునా భక్తులకు ప్రసాదాలను, అన్నదానాలను, తాగునీటిని సరఫరా చేశారు. మరి కొన్ని చోట్ల వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పడు ఆలయ ప్రాంతాలను శుభ్రపరుస్తూ కనిపించారు.

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఉత్తరాంధ్ర ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానం రెండో రోజు ఆదివారం శివరాత్రిని పురష్కరిం చుకుని భక్తులతో కిటకిటలాడింది. ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి శనివారం రాత్రే చేరుకుని జాగారాలు చేశారు. వారంతా ఆదివారం తెల్లవారు జామున కోనేటిలో స్నానాలు చేసి ఉమాసదాశివాలయంతో పాటు, శ్రీరాముని సన్నిదిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

శృంగవరపుకోట : దక్షిణ కాశీగా పేరొందిన పుణ్యగిరి శ్రీ ఉమా కోటి లింగేశ్వర ఆలయ పరిసరాలు జనసంద్రంగా మారాయి. మహాశివరాత్రి సందర్భంగా శనివారం రాత్రి జాగారం చేసిన భక్తులు ఆదివారం వేకువజాము నుండే పుణ్య గిరి కొండకు చేరుకోవడంతో కొండ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. సీఐ సింహాద్రి నాయుడు, ఎస్ఐ తారకేశ్వరరావు, సిబ్బందితో కిందకు వచ్చే భక్తులకు ఒకే మార్గం కాకుండా కొండపైకి వెళ్లేందుకు మెట్లమార్గం, కిందికి వచ్చేందుకు పుణ్యగిరి కొండపైకి రహదారి కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మార్గం గుండా భక్తులు కిందకు దిగేలా ఏర్పాటు చేశారు.

భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు

మహాశివరాత్రి సందర్భంగా పుణ్య రికి వచ్చే భక్తుల సేవలో స్వచ్ఛంద సంస్థలు తరించాయి. విజయదుర్గ జెసిబి, క్రేన్, ట్రాక్టర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాలను, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. కొండపైన మహాలక్ష్మి నాయుడు బాబా నిత్య అన్నదాన ఆశ్రమంలో పుణ్య గిరి ఉమా కోటిలింగేశ్వర స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం ఆహార పదార్థాలను అందజేశారు.వాసవి క్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పులిహోర ప్రసాదం అందజేశారు. స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పులిహోరా, మజ్జిగ అందజేశారు. అవతార్ బాబా ఆశ్రమం యాత్రికులకు భోజన ఏర్పాట్లుచేసింది. గణేష్ జ్యువెలర్స్, మల్ల జ్యువెలర్స్ పులిహోర పంపిణీ చేశారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పుచ్చకాయ ముక్కలను అందించారు. రైల్వే ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో యాత్రికులకు పులిహోర, మజ్జిగ, మంచి నీటిని పంపిణీ చేశారు. రవితేజ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సిబ్బంది పులిహోర, మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మజ్జిగ, ప్రసాదం అందజేశారు. నాయి బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.



రామతీర్థంలో జాగరం చేస్తున్న యాత్రికులు



సిఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని ఆదివారం నాయి బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన వారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. దేవాదాయ ధర్మదాయ శాఖ పాలకమండలి కమిటీలో సభ్యులుగా నాయి బ్రాహ్మణలకు గొప్ప అవకాశం కల్పించిన సందర్భంగా ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేపట్టినట్లు ఆ సంఘం కార్యదర్శి టి.ప్రసాదరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు టి.గురప్ప, వెంకటరమణ, బెనర్జీ, దుర్గాప్రసాద్, గిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య..!

- భర్తే చంపేశాడని కుటుంబ సభ్యులు ఆరోపణ
- అనాథలైన చిన్నారులు

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని ఢికొల్లం పంచాయతీ రెడ్డి పేట గ్రామంలో బుట్ట ఉష (22) ఆదివారం ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందింది. ఆమె భర్త కొట్టి చంపేశాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతురాలి తల్లిదండ్రుల వివరాలు ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం లక్ష్మీపురం పంచాయతీ నేదురుపేట గ్రామానికి చెందిన బట్టు ఉషాను డెంకాడ మండలం డి కొల్లాం పంచాయతీ రెడ్డికి పేట గ్రామానికి చెందిన బుట్ట ఆదినారాయణకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి దీక్షిత్ (3), యశ్వత (1) ఉన్నారు. భార్య భర్తలు ఇద్దరూ నిత్యం గొడవ పడుతుండే వారని తమ కుమార్తెను మద్యం సేవించి నిత్యం కొడుతూ చిత్ర హింసలు పెట్టేవాడని వాపోయారు. పెద్దల సమక్షంలో చాలాసార్లు మందలించినా అతను తీరు మార్చుకోలేదన్నారు. ఆదివారం కూడా మద్యం సేవించి విచక్షణ రహితంగా తమ కుమార్తెను భర్త ఆదినారాయణ కొట్టిచంపేసి ఉరివేసాడని ఆరోపించారు. కుమార్తె తలపై మెడపై గాయాలు ఉన్నాయన్నారు. కుమార్తె చనిపోవడంతో వారి పిల్లలు అనాథలయ్యారని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా వినిపిస్తున్నారు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త ఆదినారాయణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృత దేహాన్ని జిల్లా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.